క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి



డిచ్‌పల్లి: 'మన ఊరు– మన బడి' ద్వారా చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పనుల కింద మంజూరైన సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పీఆర్ ఏఈ శ్రీధర్, సర్పంచులు, హెచ్‌ఎంలు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు

సిరికొండ(ధర్పల్లి): ధర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, బాగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



ఖలీల్‌వాడి: కామారెడ్డి జిల్లా బీబీపేటలో వేతనాలు రాక ఆత్మహత్య చేసుకున్న గ్రామ పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన సంఘ సభ్యులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. జీపీ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

కారల్‌మార్క్స్‌కు ఘన నివాళి

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో మంగళవారం కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు ఘన నివాళులు అర్పించారు. జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ... దేశంలో, ప్రపంచంలో కొనసాగుతున్న ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద దుష్ఫలితాలకు పరిష్కారం కావాలన్నారు. నాయకులు సుధాకర్,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్లలో ఆరోగ్య మేళాలు

నిజామాబాద్ సిటీ: జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో మంగళవారం ఆరోగ్య మేళాలు నిర్వహించి, టీబీ రోగులకు ఉచితంగా మందులు, పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం తెలిపారు. నగరంలోని వినాయక్‌నగర్ ఆరోగ్య ఉప కేంద్రంలో ఆరోగ్య మేళా నిర్వహించి టీబీ రోగులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ రోగులు తెమడా నమూనాలు ఇచ్చి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వపరంగా మందులు ఉచితంగా లభిస్తాయని, చికిత్స పొందుతున్నంత వరకు ప్రతి నెలా రూ. 500 చొప్పున పేషెంట్ అకౌంట్‌లో జమ అవుతాయని ఆయన తెలిపారు. ఈ మేళా ప్రతీ నెల 14న జరుగుతుందన్నారు.

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం ఆరోగ్య మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగప్రసాద్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం టీబీ రోగులకు మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఎంపీహెచ్‌ఏ సురేష్, శోభ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కవితను కలిసిన టీఎన్జీవో నాయకులు



సుభాష్ నగర్: జిల్లాకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవితను టీఎన్జీవో నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళా ఉద్యోగుల సమస్యలు, జిల్లా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీనిచ్చారు. టీఎన్జీవో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ హిళా దినోత్సవాన్ని నిర్వహించడంతో జేఏసీ చైర్మన్ అలుక కిషన్, కార్యవర్గ బృందాన్ని కవిత అభినందించారు. టీఎన్జీవో సహాధ్యక్షుడు చిట్టి నారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్, పోల శ్రీనివాస్, ఉమా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా డ్రెయినేజీల నిర్మాణం

- టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకం
- స్థానికుల నిరసన

నిజామాబాద్‌నాగారం: నగరంలో అభివృద్ధి పనులు పక్కా ప్రణాళికతో జరగాలంటే టౌన్ ప్లానింగ్ అధికారులే అత్యంత కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. నూతన రహదారులు, డ్రెయినేజీలు, రోడ్ల వెడల్పుల విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రూట్‌మ్యాప్ ప్లానింగ్ తయారు చేసి, పనులు చేపడుతారు. కానీ సంబంధిత అధికారులు ప్రస్తుతం ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

30, 31 డివిజన్‌లలో..

నగరంలోని 30, 31 డివిజన్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణం అస్తవ్యస్తంగా, ఇష్టారాజ్యంగా జరుగుతుందని స్థానికులు ఇటీవల ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సయ్యద్‌ఖైసర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఎంఐఎం నాయకులతో కలిసి డ్రెయినేజీ నిర్మాణ ప్లానింగ్‌ను ఇష్టారాజ్యంగా తయారు చేశారని మండిపడ్డారు. ఒక కిలో మీటర్ పొడువున డ్రెయినేజీ నిర్మాణ పనులు రూ. కోటీ 30లక్షలతో జరుగుతున్నాయి. డ్రెయినేజీలోకి నిజాంసాగర్ ప్రధాన కెనాల్ కింది నుంచి, గుట్టల నుంచి, సీఎండీ రోడ్‌లోని మదర్సా ప్రాంతాలు, తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వర్షపు, మురుగునీరు వస్తుంది. ఈ నీరంతా శైలేజా మైదానం పక్కనుంచి వెళ్లాలి. కానీ కొంతమంది ఎంఐఎం నాయకుల స్వలాభం, ఓ ప్రజాప్రతిని ఒత్తిడి వల్ల అధికారులు డ్రెయినేజీ నిర్మాణాన్ని పేదల ప్లాట్ల నుంచి చేపట్టడానికి పూనుకున్నారు. దీంతో స్థానికులు ఇటీవల అడ్డుకొని నిరసన తెలిపారు. న్యాయం చేసేదాక పనులు జరగనివ్వమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, పేదలకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



డ్రెయినేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న స్థానిక నాయకులు, ప్రజలు

మళ్లీ నివేదిక తీసుకుంటాం..

నగరంలో డ్రెయినేజీల నిర్మాణం విషయంలో మళ్లీ టౌన్‌ప్లానింగ్ అధికారుల ద్వారా నివేదిక తీసుకుంటాం. అందరి అభిప్రాయం తీసుకొని మ్యాప్‌ను తయారు చేయాలని చెప్పాం. అదేవిధంగా ముందుకు వెళ్లతాం. లేకుంటే పనులు ఆపివేస్తాం. ప్రస్తుతానికి కల్వర్టు నిర్మాణం జరుగుతుంది.

– శంకర్, ఏఈ, నిజామాబాద్

ఘనంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు





తెయూలో కేక్‌కట్ చేస్తున్న వీసీ రవీందర్, అధ్యాపకులు.. నగరంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో..

తెయూ(డిచ్‌పల్లి)/నిజామాబాద్‌నాగారం/సుభాష్ నగర్: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వివిధ శాఖల ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో తెయూ వీసీ రవీందర్, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు కేక్ కట్ చేసి, సంబురాలు నిర్వహించారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యలయంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు కేక్ కట్ చేశారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. తహసీల్దార్లు సతీష్‌రెడ్డి, జనార్దన్, సురేష్, వినోద్ రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

గంగపుత్రులను ఆదుకోవాలి



మోపాల్: రాష్ట్రంలో జీవోనెంబర్ 6వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తమను ఆదుకోవాలని గంగపుత్ర అభివృద్ధి కమిటీ సభ్యులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి విన్నవించారు. మంగళవారం రేవంత్‌రెడ్డి నిర్వహించిన 'జోడో యాత్ర'లో ఆయన ను కలిసి, సమస్యలను వివరించారు. కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. 55ఏళ్లు నిండిన గంగపుత్రులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, గంగపుత్రులు మరణిస్తే రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం రేవంత్‌రెడ్డికి చేపలను అందించారు.

తెయూ(డిచ్‌పల్లి): ముల్లంగిలో నిర్వహించిన పాదయాత్రలో టీపీసీసీ రేవంత్‌రెడ్డిని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు కలిసి యూనివర్సిటీ సమస్యలను వివరించారు. విద్యార్థులు సంజయ్, మోహన్, శ్రీను, విజయ్, రమేష్ ఉన్నారు.



మంచిప్ప గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సభకు గ్రామస్తులు, కాంగ్రెస్ నేతలు భారీగా వచ్చారు.

తెలుగు పాటకు పట్టాభిషేకం..

నిజామాబాద్ సిటీ: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటునాటు పాటకు ఇటీవల ఆస్కార్ అవార్డు దక్కింది. ఈసందర్భంగా నగరంలోని ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ, మంగళవారం తమ ఆనందాన్ని సాక్షితో పంచుకున్నారు.

రచయితకు అభినందనలు..



ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావటం అంతర్జాతీయ వేదికపై తెలుగుపాటకు పట్టాభిషేకం జరిగినట్లుగా అనిపించింది. తెలుగువారైన చంద్రబోస్, కీరవాణిల వల్ల ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం దీనికి సాక్ష్యంగా మన తరం ఉండడం మహద్భాగ్యం. సుదీర్ఘ కాలంగా ప్రజలు మెచ్చే పాటలు రాస్తూ, నేడు ఆస్కార్ అవార్డుతో ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన పాటల రచయిత చంద్రబోస్‌కు అభినందనలు.

– డాక్టర్ కాసర్ల నరేష్‌రావు పాటల రచయిత

పూర్ణకుంభాన్ని అందుకోవడమే



ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆసార్క్ అవార్డు అందుకోవడం అంటే వారు పూర్ణకుంభాన్ని అందుకోవడమే. మన తెలుగు వాడి రుధిరంతో పండించిన హరిత హృదయాన్ని ఆవిష్కరించడమే. ఆర్‌ఆర్‌ఆర్ ధర్పమైన నాటునాటు పాట అంతర్జాతీయ స్థాయిలో అందరి హృదయాలలో ప్రాణంలా నాటుకు పోయింది.

– పింగాళి గంగాధర్‌రావు. గేయ రచయిత

ప్రతి భారతీయుడు గర్వించదగినది..



సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డ్ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు రావడం ప్రతి భారతీయుడు, తెలుగువాడు గర్వించదగిన విషయం. ఇన్ని రోజులు చంద్రబోస్‌కు జాతీయ స్థాయి అవార్డు రాలేదనే బాధ కొంచెం ఉండేది. కానీ ఆస్కార్ అవార్డు రావడంతో సంతోషం రెట్టింపు అయింది. ఒక కవిగా, సినిమా గేయ రచయితగా నేనూ గర్విస్తున్నాను.

– మల్లేగోడ గంగాప్రసాద్, గేయ రచయిత

పాటకు ప్రపంచ స్థాయి గుర్తింపు..



మన భారతీయ మట్టి వాసనను, పల్లె గీతిక పరిమళాలను, జలనాట్య సంస్కృతిని ప్రపంచమంతా పరిచయం చేసిన పాట 'నాటు నాటు'. పాట రచయిత తెలుగువాడు కావడం అందునా తెలంగాణ వాడు కావడం, మనకు గర్వకారణం. అదే విధంగా గాయకులు రాహుల్, కార్తికేయ, సంగీత దర్శకులు కీరవాణి, దర్శకులు రాజమౌళి చిత్ర యూనిట్ వారందరికి అభినందనలు.

– శ్రీమన్నారాయణాచార్య, కవి

ఆధ్యాత్మికం..

శీతలమాతకు ప్రత్యేక పూజలు



నిజామాబాద్ సిటీ: ప్రతి సంవత్సరం హోలీ అనంతరం వారంరోజుల పాటు మార్వాడీ మహిళలు శీతలమాతకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈసందర్భంగా మంగళవారం మార్వాడి మహిళలు నగరంలోని పోచమ్మగల్లి పోచమ్మ ఆలయంలో శీతలమాత(పోచమ్మ)కు పూజలు చేసి చల్లటి నైవేద్యాన్ని సమర్పించారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



జక్రాన్‌పల్లి: మండలంలోని కేశ్‌పల్లిలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బోనాలను ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉపసర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ మున్నూరు గంగాధర్, గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మోపాల్: నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు మంగళశారం రెండో రోజు కొనసాగాయి. దేవనాథ జీయర్‌స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి ప్రవసించారు. వారి సమక్షంలో ప్రముఖ నిర్మాత దిల్‌రాజు గరుడ ధ్వజ రోహణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దిల్‌రాజు, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, శిరిష్, ప్రకృతి సేద నిపుణులు విజయరామ్, భక్తులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్, గోల్‌హనుమాన్ హుండీల లెక్కింపు

నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్‌ఆలయం, గోల్‌హనుమాన్ ఆలయాల హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ, ఆలయ ఈవో వేణు, కంఠేశ్వర్, గోల్‌హనుమాన్ ఆలయాల కమిటీ చైర్మన్లు బిల్లా మహేష్, నీలగిరి రాజేష్(రాజు), ఇన్‌స్పెక్టర్ కమల, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. కంఠేశ్వర్ హుండీలో రూ. 2,93,152 ఆదాయం వచ్చింది. అలాగే గోల్‌హనుమాన్ ఆలయ హుండీ ద్వారా రూ. 45,164 వచ్చినట్లు ఈవో వేణు తెలిపారు.

కృష్ణకుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నిజామాబాద్ సిటీ: తల్లి కోరికను తీర్చేందుకు తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి స్కూటర్‌పై దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను తల్లికి చూపెడుతున్న దక్షిణమూర్తి కృష్ణకుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మేయర్ నీతూకిరణ్ అన్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన కృష్ణకుమార్ తన తల్లికి దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలను చూపిస్తూ సోమవారం నిజామాబాద్‌కు చేరుకున్నారు. మంగళవారం నగరంలోని శివాజీనగర్ రామకృష్ణ విద్యాలయంలో కృష్ణకుమార్, అతడి తల్లి రత్నమ్మలను మేయర్ సన్మానించారు. పాఠశాల యాజమాన్యం శశిరేఖ, శ్రీనివాస్, మధు, మాధురి పాల్గొన్నారు.

క్రైమ్ న్యూస్

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరి మృతి

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం గ్రామంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడినట్లు డిచ్‌పల్లి ఎస్సై గణేష్ తెలిపారు. వివరాలు ఇలా.. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన భిక్షపతి (35), కంజర్ గ్రామానికి చెందిన గంగాప్రసాద్ బైక్‌పై దూస్‌గాం గ్రామానికి వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో మూలమలుపులో ట్రాక్టర్ ట్రాలీ, బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో భిక్షపతి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందగా, గంగాప్రసాద్ గాయపడ్డారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. వర్ని మండలంలోని హుమ్నాపూర్ గ్రామానికి చెందిన కడమంచి రాములు(38) నగరంలో భిక్షాటన చేసుకుంటూ జీవించేవాడు. మంగళవారం అతడు నగరంలో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని జన్నేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై జ్ఞానీ సింగ్ తెలిపారు. వివరాలు ఇలా.. రెంజల్ మండలంలోని నీలా గ్రామానికి చెందిన నవాజుద్దీన్, ఇర్ఫాన్ నిజామాబాద్‌లోని ఓ వస్త్రాదుకాణంలో పనిచేస్తున్నారు. మంగళవారం వారు పని నిమిత్తం బైక్‌పై వస్తుండగా.. ఓవర్ టేకింగ్ చేస్తుండగా బస్సు, బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి కాళ్లు విరిగాయి. బస్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

సెల్‌టవర్ తొలగించాలి

సుభాష్‌నగర్: రుద్రూర్‌లో ఎయిర్టెల్ సెల్ టవర్‌ను తొలగించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచర్ల భాస్కర్ రాజ్, ఫోరం సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ఆరోగ్య ట్రెనింగ్ శిక్షణ కేంద్రంలో మ్యాన్‌కిండ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాలింతలు, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంజనా, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య పంపిణీ చేశారు. జిల్లా టీబీ, హెచ్‌ఐవీ కో–ఆర్డినేటర్ రవిగౌడ్, సాతి ప్రోగ్రాం ఆఫీసర్ రవి కుమార్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నిజామాబాద్ అర్బన్: టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యంతోనే ప్రశ్నాపత్రాలు లీకు అయ్యాయని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ సింగ్ ఒక ప్రకటన డిమాండ్ చేశారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ)పేపర్ లీక్ ఘటన వెనుక టీఎస్పీఎస్సీ సభ్యులపై విచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,100	వెండి (కిలో)	68,000
22 క్యారెట్స్	54,230		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	క్యాప్సికం	30	50
బెండకాయ	50	70	గాజరుగడ్డ	15	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	30	50	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	10	20	గోబిపువ్వు	25	50
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	45	70
కొత్తిమీర	10	20	చిక్కుడుకాయ	40	60
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– బలగం– 1.40, 7.30
ఆర్.ఆర్.ఆర్. (తెలుగు)–10.10 సార్– 4.30,10.20
స్క్రీన్–2– తు జూఠి మై మక్కార్(హిందీ)10.25
65–ఇంగ్లీష్–2డీ–1.45 4.40,10.40
ఆర్ఆర్ఆర్–(తెలుగు)– 7.00
స్క్రీన్–3– తు జూఠి మై మక్కార్(హిందీ)
1.30, 4.35, 7.40, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– తు జూఠి మై మక్కార్(హిందీ)
11.40,3.10 ,6.40,10.10
స్క్రీన్–2 – తు జూఠి మై మక్కార్(హిందీ)
9.50,1.20,10.40
బలగం–4.50 సార్ –1.50, 7.40
స్క్రీన్–3– 65 (తెలుగు) – 11.15
దోచేవారెవరు రా –1.30 టాక్సీ–4.05
ఆర్ఆర్ఆర్ (తెలుగు) – 6.50
స్క్రీన్–4– సీఎస్ఐ సమతా–(తె),1.50
స్క్రీమ్–6(ఇంగ్లీష్) – 4.40, 9.40
65(ఇంగ్లీష్)–7.25

దేవి	సార్
నటరాజ్	65
లలితామహల్	ఆర్.ఆర్.ఆర్
విజయ్	బలగం

సంక్షిప్తం

బర్ధిపూర్‌లో కంటివెలుగు ప్రారంభం

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ నీరడి సుజన మంగళవారం ప్రారంభించారు. ఉప సర్పంచ్ గంగారెడ్డి, నాయకులు పద్మరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొండూర్‌లో సీసీ రోడ్డు పనులు..

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గాదారి నర్సారెడ్డి మంగళవారం ప్రారంభించారు. వార్డు సభ్యులు గర్గుల రాములు, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎఫ్‌ఎల్‌సీఆర్‌పీ శిక్షణ బ్యాచ్‌ను మంగళవారం డీపీఎం నీలిమ ప్రారంభించారు. 61మందికి ఆరు రోజుల పాటు శిక్షణ ఉంటుందని డీపీఎం తెలిపారు. మురళీమోహన్, సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మీ, రామకృష్ణ, నవీన్, రంజిత్ పాల్గొన్నారు.

నగరంలో శాంతి సమావేశం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటనారయణ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి, రంజాన్ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటరినేరియన్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నథచారి ఆవిష్కరించారు. ఏడీ బాలిక్ అహ్మద్, పశువైద్యాధికారులు బస్వారెడ్డి, ప్రమోద్ కుమార్, కీర్తిరాజ్, వెటరినేరియన్స్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల భాస్కర్, కార్యదరి మహేందర్ పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జనసేన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్‌ను కలిసిన అందె జీవన్‌రావు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర అవార్డు గ్రహీత, విశ్రాంత జిల్లా ఇంటర్ వృత్తి విద్యాధికారి అందె జీవన్‌రావు మంగళవారం త్రిపుర రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్, నిజామాబాద్ జిల్లా వాసి, శ్రీమతి విశ్వ శ్రీని కలిశారు. సూపర్ బ్రెయిన్ యోగాను గురించి ఆమెకు వివరించారు. త్రిపుర రాష్ట్రంలో విద్యాశాఖ అధికారులతో ఈ అంశం అమలుపై చర్చిస్తానని విశ్వ శ్రీ అన్నారని అందె జీవన్ రావు తెలిపారు.